

ఏజెన్సీల నుంచి టెండర్ల ఆహ్వానం

వికారాబాద్, జూలై 18: జిల్లాలో వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ సర్వీసులు ఏర్పాటు నిమిత్తం రిజిష్టర్డ్ ఏజెన్సీల నుంచి టెండర్లు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం తెలిపారు. టెండర్ పారాలు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం నుంచి జూలై 20 నుంచి పొందవచ్చని, జూలై 26వ తేదీ వరకు సీల్డ్ టెండర్లను స్వీకరిస్తామన్నారు. 27న ఉదయం 10:30 ఏజెన్సీల సమక్షంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో టెండర్లను తెరుస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.



కొడంగల్: దుద్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు



పరిగిలో రుణమాఫీ సంబరాల బైక్‌ర్యాలీలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు

రుణమాఫీతో సంతోషం కలుగుతోంది

రుణమాఫీ కావటం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఎప్పుడూ నాకు రుణ మాఫీ కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కింద నాకు రూ.78వేలు మాఫీ చేసింది. మూడేళ్ల కింద భూమి అమ్ముకున్నా. పట్టా పాసుపుస్తకాల కోసం బ్యాంకులో ఉన్న రూ.1.3లక్షల అప్పు కట్టాను. నాకు ఉన్న 1 ఎకరం 30గుంటల భూమికి నాగ సమందర్ ఎస్‌బీఐ బ్రాంచిలో రూ.78వేలు పంట రుణం తీసుకున్న. ఇప్పుడు ఆ అప్పు మాఫీ అయింది. దీంతో మా కుటంబం ఆనందిస్తోంది. రేవంత్‌రెడ్డి అంటే నాకు అభిమానం.



- బాలప్ప, రైతు, గడ్డమీది గంగారం, ధారూరు

రైతుల సంబరాలు

రూ.లక్ష వరకు పంటరుణం మాఫీ.. అన్నదాతల ఆనందం

రైతులు ఏళ్లుగా ఆశగా ఎదురు చూస్తున్న కోరిక గురువారం నెరవేరింది. పంట రుణాల మాఫీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బటన్ నొక్కి ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతులకు డబ్బులను రెన్యూవల్ కోసం విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిసింది. బ్యాంకు ఖాతాల నుంచి రైతులు కొత్తగా రుణం పొందనున్నారు. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లో రైతులు, కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు. అంతకు ముందు రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో రైతులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి సీఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా రైతులు మాట్లాడిన అంశాలపై ఎల్ఈడీ స్క్రీన్లలో వీక్షించారు.

- ముఖ్యమంత్రి ఫ్లెక్సీలకు కాంగ్రెస్ నాయకులు, రైతుల పాలాభిషేకాలు
- వికారాబాద్ జిల్లాలో తొలి విడతలో 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్ల మాఫీ
- మేడ్చల్ జిల్లాలో 2,667మంది రైతులకు రూ.12.53 కోట్ల రుణమాఫీ
- రైతు వేదికల్లో రైతులతో సమావేశాలు
- రుణ మాఫీ వేడుకల్లో పాల్గొన్న అధికారులు

వికారాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి)

తాము అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఆ మేరకు హామీని అమలుచేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. గురువారం మొదటి విడత జిల్లాలో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న 46,633 మంది రైతుల ఖాతాలకు సర్కారు రూ.256.26కోట్లను బదిలీచేసింది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం బటన్ నొక్కి ఆన్‌లైన్ ద్వారా రుణమాఫీ నిధులు విడుదల చేశారు. వికారాబాద్ జిలాకల బంట్వారం మండలంలో 924మంది రైతుల ఖాతాలకు రూ.5,67,16,082 జమ చేశారు.ధారూరు మండలంలో 2766 మందికి రూ.14,88,43,105, మర్పల్లిలో 3,108మంది రైతులకు రూ.16,94,03,334, మోమిన్‌పేట్ 2,100మంది రైతులకు 11,55,98,774, వికారాబాద్ మండలంలో 2,527మంది రైతులకు రూ.12,83,19,038 రుణ మాఫీ చేశారు. బషీరాబాద్ మండలంలో 2,109 మంది రైతులకు రూ.12,09,36,791, కోట్‌పల్లి మండలంలో 1,102 మంది రైతులకు రూ.6,66,79,701, పెద్దేముల్‌లో 1,910 మంది రైతులకు రూ.11,19,18,949, తాండూరులో 2,017 మంది రైతులకు రూ.11,97,81,364, యాలాల 2,464 మంది రైతులకు రూ.14,00,37,798 రుణమాఫీ చేశారు. చౌడాపూర్ మండలంలో 2,144మంది రైతుల ఖాతాల్లో రూ.11,67,06,448 జమచేయగా, దోమలో 3,032 మందికి రూ.16,38,15,702, కులకచర్ల 2,402 మందికి రూ.13,26,67,201, పరిగిలో 2,981 మంది రైతులకు రూ.16,54,72,234, పూడూరులో 2,437మంది రైతులకు రూ.12,11,02,399 రుణమాఫీ డబ్బు జమ చేశారు. బొంరాస్‌పేటలో 2,954 మంది రైతుల ఖాతాలకు రూ.17,18,78,705, దౌల్తాబాద్‌లో 3,682 మంది రైతులకు రూ.20,10,17,798, కొడంగల్ మండలంలో 2,968మంది రైతులకు రూ.16,66,24,352, నవాబ్‌పేట మండలంలో 2,952మందికి రూ.14,51,10,747 చొప్పున రుణమాఫీ విడుదల చేశారు. రెండో విడత ఈ నెలాఖరులోగా రూ.1.5లక్షల వరకు అప్పు తీసుకున్న రైతుల పంటరుణాన్ని మాఫీ చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 14వ తేదీలోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. వికారాబాద్, మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు నిర్వహించి మిఠాయి పంచారు. సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ ప్రతీక్ జైన్ మోమిన్‌పేట రైతువేదిక నుంచి పాల్గొన్నారు. రుణ మాఫీ సందర్భంగా పరిగి నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో, తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నేతృత్వంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. సీఎం, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, రైతులు కలిసి పాలాభిషేకాలు, సంబరాలు నిర్వహించారు.

అర్హులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా బ్యాంకులు, సొసైటీల బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, బ్యాంక్, డీసీసీబీ అధికారులు, సహకార బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 డిసెంబరు 2018 తర్వాత తీసుకున్న లేదా రెన్యూవల్ చేసుకున్న పంటరుణాల్లో 9 డిసెంబరు 2023 నాటికి బకాయిన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలో మొదటి విడత 2,667 మంది రైతులకు రూ.12.53కోట్ల రుణమాఫీ చేస్తున్నామన్నారు. రైతుల ఖాతాలో డబ్బు వేసి రెన్యూవల్ చేయాలన్నారు. మరో రెండు విడతల్లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. రైతులకు ఏమైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ కార్యాలయంలో(గ్రీన్ సెల్) ఏర్పాటు చేసి రైతుల సందేహాలను తీరుస్తామన్నారు. ప్రతీ బ్యాంకులో ఒక నోడల్ అధికారిని నియమించి రైతుల సందేహాలు తీరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఏవో మేరీ రేఖ, ఎల్‌డీఎం శ్రీనివాసులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

రైతుల్లో జోష్!

రుణమాఫీ-2024 నిధుల విడుదలతో రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించారు. రైతు వేదికలను తోరణాలు, పూలతో అలంకరించారు. టీవీల్లో సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడే కార్యక్రమాన్ని వీక్షించారు. కలెక్టర్ గౌతమ్ శామీర్‌పేట మండలం అలియాబాద్ రైతు వేదికలో పాల్గొన్నారు. పంట రుణ మాఫీ రైతులకు పండుగ అని, రుణ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకున్న గొప్పనిర్ణయన్నారు. లక్ష వరకు రైతుల రుణం జీరో అవుతుందన్నారు. రెండు, మూడో విడతల్లో రూ.2లక్షల వరకు మాఫీ అవుతుందన్నారు. వచ్చిన డబ్బుతో రైతులు రుణాలను వెంటనే రెన్యూవల్ చేసుకోవాలన్నారు.



రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణామాఫీ చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికారాబాద్ మండలం నారాయణపూర్ రైతు వేదికలో రైతులతో ముఖ్యమంత్రి వీసీలో మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏవో జ్యోతి, ఎంపీవో నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జాఫర్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్: ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం రైతు రుణమాఫీ పథకం ద్వారా జమవుతున్న రుణమాఫీ డబ్బులు రైతులకు చేరేలా బ్యాంకర్లు, ఏఈవోలు చర్యలుతీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఏ ఇబ్బందులు కలుగకుండా డబ్బును ఖాతాల ద్వారా రైతులకు అందజేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడత వేలాది కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తోందన్నారు. జిల్లాలో 46,633మంది రైతులకు రూ.256.26కోట్ల రుణమాఫీ వర్తించిందని చెప్పారు. ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతువేదికల్లో, పంచాయతీ కార్యాలయాల్లో రుణమాఫీ వర్తించిన రైతుల పేర్లను డిస్ప్లే చేయాలన్నారు. రైతులు 1బి, ఆధార్‌కార్డు, పట్టాపాస్ పుస్తకాలతో బ్యాంక్‌కు వెళ్లి రెన్యూవల్ చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. 30రోజుల పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు రుణమాఫీ చేరేలా చూడాలన్నారు. లిస్టులో పేర్లులేని పక్షంలో కలెక్టరేట్ కార్యాలయంలో రుణమాఫీ సహాయ కేంద్రం టోల్‌ఫ్రీ నంబర్లు 9989291049/9000470989లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎల్డీఎం యాదగిరి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్‌ఇండియా, గ్రామీణ బ్యాంకు, కో-పరేటివ్ బ్యాంకు, ఇతర అడాప్టెడ్ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ

మోమిన్‌పేట్: బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతుకు 2లక్షల రుణ మాఫీ వర్తిస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మోమిన్‌పేట్ రైతువేదికలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని రైతులతో మాట్లాడారు. ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, డీఏవో గోపాల్, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో యాదగిరి, ఏవో భూపతిజయశంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్, సుభాష్‌గౌడ్, సిరాజుద్దీన్, మానయ్య, మహేందర్‌రెడ్డి, సురేందర్, ఏరాజ్‌పాష, ఏఈవోలు మౌనిక, పెంటయ్య, చంద్రిక పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

శామీర్‌పేట, జులై 18: గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో ప్రజలు విరివిగా మొక్కలు నాటి పెద్ద వృక్షాలుగా ఎదిగే దాకా వాటిని బాధ్యతతో సంరక్షించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం మజీద్‌పూర్ రైతువేదిక వద్ద రైతు రుణమాఫీ సంబరాలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ విచ్చేశారు. అనంతరం రైతువేదిక ఆవరణలో కలెక్టర్, డీఏవో మేరీ రేఖ, స్పెషలాపీసర్ సైదులు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఏవో రమేశ్, తహశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, డీఏవో మేరి రేఖ, స్పెషలాఫీసర్ సైదులు

తుది దశకు బదిలీల ప్రక్రియ



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు

వికారాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో చేపట్టిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. సూపరింటెండెంట్ల నుంచి నైట్ వాచ్‌మెన్ వరకు బదిలీలు చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో పాటు మిగతా ప్రభుత్వ శాఖల్లో సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్ల, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగులను సైతం బదిలీ చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో వివిధ క్యాడర్ ఉద్యోగుల బదిలీలు నిర్వహించారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో 56మంది జూనియర్ అసిస్టెంట్లు ఉండగా, వారిలో 22మందిని బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లు 21మంది ఉంటే, 9 మంది బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్లు 14మంది ఉంటే, నలుగుర్ని బదిలీ చేశారు. ఆరుగురు ఎంపీవోలు, 184 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఐదుగురు టైపిస్టులు, 8మంది రికార్డు అసిస్టెంట్లు, 34 మంది ఆఫీస్ సబార్డినేట్లు బదిలీ అయ్యాయి. నైట్ వాచ్‌మెన్ నలుగురు బదిలీ అయ్యారు. ఇదిలా ఉంటే, పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వికారాబాద్ జిల్లా నుంచి ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు సంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, జిల్లాకు ఒక సీనియర్ అసిస్టెంట్ బదిలీపై వచ్చారు. రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల్లో పనిచేసే సీనియర్/జూనియర్/రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు.

సంగెంకలాన్‌లో అక్రమ మైనింగ్

- ప్రభుత్వ, పట్టా భూముల్లో అనుమతి లేకుండా తవ్వకాలు
- ప్రభుత్వ రాయల్టీకి గండి
- తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల ఫిర్యాదు

తాండూరు రూరల్, జూలై 18: ప్రభుత్వ, పట్టా భూముల్లో జోరుగా అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. అధికారుల పట్టింపులేక అక్రమార్కులు బరితెగిస్తున్నారు. నాపరాతి గనుల్లో తవ్వకాలు చేస్తూ ప్రభుత్వానికి రాయల్టీ ఎగ్గొడుతున్నారు. వ్యాపారులు గనులు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అనుమతులు లేకుండానే తవ్వకాలు చేస్తున్నారు. తాండూరు మండలం సంగెంకలాన్ శివారులో సర్వేనంబర్-110లో పట్టాభూమిలో రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతుల్లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటూ తవ్వకాలు చేస్తున్నారు. నాపరాతి గనుల వ్యర్థాలు(రాతి ముక్కల)ను ప్రభుత్వ భూముల్లో డంప్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సంగెంకలాన్‌లోనే సర్వే నంబర్ 109లో ప్రభుత్వ భూమిని పేదలకు అసైన్ చేయగా పేద రైతులకు వ్యాపారులు ఆశచూపి ఆ భూముల్లోనూ మైనింగ్ చేస్తున్నారు. రెండెకరా అసైన్డ్ భూముల్లో కమలాపురం షర్ఫొద్దీన్, రామకృష్ణ అనే ఇద్దరు తవ్వకాలు చేస్తున్నారు. గురుబసప్ప పొలం నుంచి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకొని వ్యాపారానికి విద్యుత్ చౌర్యం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ లైన్‌మెన్, ఏఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వ్యాపారుల నుంచి డబ్బు తీసుకొనే వారు కనెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మైనింగ్ అధికారులు సైతం నెలనెలా మామూళ్లు తీసుకుంటూ ఇటు వైపు చూడటం లేదంటున్నారు. రెండెకరాల అసైన్డ్ భూమిలో ఇప్పటికే ఒకటిన్నర ఎకరాల్లో భారీగా మైనింగ్ గోతులు ఏర్పడ్డాయి. అర ఎకరంలో రెండు రోజుల నుంచి తవ్వకాలు చేపట్టారు.



సంగెంకలాన్ శివారులో సర్వే నంబర్-110 పట్టా భూమిలో కొనసాగుతున్న తవ్వకాలు

తవ్వకాలపై మాజీ సర్పంచ్ ఫిర్యాదు

సంగెంకలాన్‌లో నాపరాతి అక్రమ తవ్వకాలపై ఆ గ్రామ మాజీ సర్పంచ్ సంగెంక మేఘనాథ్‌గౌడ్ మూడు రోజుల క్రితం తహసీల్దార్ తారాసింగ్, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, విద్యుత్ ఏడీఈ ఆదినారాయణలకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు 110 పట్టా భూమిలో, సర్వే నంబర్ 109లో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తూ రాతి వ్యర్థాలను పారబోశార న్నారు. ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే విచారణ చేయాలన్నారు. స్థానిక అధికారులు స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన చెప్పారు.



పట్టా భూమిలో నాపరాతి మిషన్‌తో కట్టింగ్

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

సంగెంకలాన్‌లోని పట్టా, అసైన్డ్ భూముల్లో అక్రమంగా కొనసాగుతున్న అక్రమ తవ్వకాలపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులపై మేం గ్రామంలో పర్యటించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మైనింగ్ అనుమతులు లేని చోట్ల తవ్వకాలు జరపడం చట్టరీత్యా నేరం. వారు ఎంతటి ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

- తారాసింగ్, తహసీల్దార్

గిరిజన యువకుడికి ఐఐటీలో సీటు

బొంరాస్‌పేట్, జూలై 18: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో దుద్యాల గ్రామ పరిధి లోని రక్తమైసమ్మ తండాకు చెందిన జాదవ్ అర్జున్ సీటు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అర్జున్ జడ్పీహెచ్ఎస్ దుద్యాల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. తండ్రి రామునాయక్ ఇటుక బట్టీలో పని చేస్తూ కుమారుడిని చదివించాడు. తండ్రి కష్టాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి ఐఐటీలో రసాయనశాస్త్రం విభాగంలో సీటు సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు జాలాది

ఘట్‌కేసర్, జూలై 18: విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి శక్తివంచనలేకుండా శ్రమించాలని విద్యావేత్త మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు జాలాది అన్నారు. కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నిక్ విభాగం ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయంగా కళాశాల అధ్యాపక బృందం నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రపంచంలో విస్తరిస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. నేటి విద్యార్థులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శివకేశవరెడ్డి, సైకాలజిస్టు అభిషేక్ సింగంశెట్టి, సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జరుపుల మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న శ్రీకృష్ణదేవరావ్,అనిల్‌మింజ్

శామీర్‌పేట, జూలై 18: సమాజంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని నల్సార్ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ పిలుపునిచ్చారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ ఆవరణలో గురువారం రంగారెడ్డి సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ఆధ్వర్యంలో అధికారులు, జవాన్లు, విద్యార్థులు, వైస్ ఛాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ వనమహోత్సవాన్ని నిర్వహించి పెద్దఎత్తున మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పాఠశాలకు చెందిన వంద మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సింధు, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెర్ సీఆర్ బురరాక్, అసిస్టెంట్ కామాండెంట్లు మారుతీ నాయక్, వినయ్‌రెడ్డి, అశ్విని, సుబేదార్ కార్తీకేయన్ మొక్కలు నాటారు.

బీరోల్ గ్రామ నక్షరోడ్డు పరిశీలన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతి

బంట్వారం (కోట్‌పల్లి) జూలై 18: బీరోల్ గ్రామ నక్ష రోడ్డును గురువారం వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమాభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత సోమవారం ప్రజావాణిలో గ్రామానికి చెందిన రైతులు వారి పొలాలకు వెళ్లే నక్ష రోడ్డును కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రైతుల పొలాలకు వెళ్లే నక్ష రోడ్డును తహసీల్దార్, సర్వేయర్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. నక్ష రోడ్డును కబ్జా చేస్తే చర్యలు తప్పవని తెలిపారు. వెంటనే సర్వేచేసి సమస్యను పరిశీలించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఆశజ్యోతి, సర్వేయర్ రమేష్ తదితరులు ఉన్నారు.

'వికారాబాద్‌కు త్వరలో నిధులు'

వికారాబాద్, జూలై 18: వికారాబాద్‌కు త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, మున్సిపాలిటీ అభివృద్ధిలో పరుగులు పెట్టనుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో గురువారం స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులు కేటాయించాలని స్పీకర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అతి త్వరలో వికారాబాద్ అభివృద్ధికి కావాల్సిన నిధులు సమకూరబోతున్నాయని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి

చేవెళ్ల, జూలై 18 : గ్రామాల్లో వీధికుక్కల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు చేవెళ్ల ఎంపీడీవో హిమ బిందును కలిసి వినతిపత్రం అందించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎక్కడ చూసినా వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి చిన్నపిల్లలు, మహిళలు భయపడుతున్నారని పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అశోక్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, నితీష్, భాస్కర్, జయసింహ రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

సబితారెడ్డిని విమర్శిస్తే సహించం


మాట్లాడుతున్న లక్ష్మయ్య

మహేశ్వరం, జూలై 18 : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని, ఆమెను విమర్శించే అర్హత తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్‌కు లేదని బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జల్లెల లక్ష్మయ్య అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సబితారెడ్డి బిక్షతో చైర్మన్ అయిన మధుమోహన్.. తన స్వార్థ రాజకీయాలకోసం పార్టీ మారి, ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరిస్తూ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అని కూడా చూడకుండా స్థాయికి మించిన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇకనుంచి ఎమ్మెల్యే సబితారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. నాయకులు వి.సురేష్, బుచ్చిరెడ్డి, సామేల్‌రాజు, బండ మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా మహ్మద్ సలీం



రంగారెడ్డి అర్బన్, జూలై 18 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా మహ్మద్ సలీంను నియమించారు. ఈమేరకు ఆలిండియా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ గురువారం మహ్మద్ సలీంకు నియామక పత్రాన్ని అందించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటు పడాలని మధుయాష్కీగౌడ్ సూచించారు.


ఈతమొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

తలకొండపల్లి, జూలై 18: వనమహోత్సవంలో భాగంగా ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ పిలుపు నిచ్చారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో 20 వేల ఈత, తాటి, కర్జూరం మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం బదునాపూర్‌లో గురువారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. గ్రామ రైతులు కృష్ణగౌడ్, శివగౌడ్ వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ బద్యనాథ్ చౌహాన్ పాల్గొని రైతులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి వెయ్యి ఈతమొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది, శంకర్, బాబు, లోయ, తదితరులు పాల్గొన్నారు.


ఫకీరప్పను సన్మానిస్తున్న వికారాబాద్ యూనియన్ నాయకులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

వికారాబాద్, జూలై 18: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పకీరప్ప తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికై మొదటి సారి వికారాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ఆర్ఎం.గిరీశ్వర్ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్, జిల్లా కోశాధికారి కుమ్మరి రాఘవేందర్, నాయకులు మహేష్, అశోక్, శ్రీకాంత్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా రమేశ్

పరిగి, జూలై 18: ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా పరిగి ప్రాంతానికి చెందిన అప్పగళ్ల రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మాతంగి ఓదేలు మాదిగ నియామకపు పత్రాన్ని అందజేశారు. రమేశ్ గతంలో పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారు. రమేశ్ ఎమ్మార్పీస్ సేవలను గుర్తించి జిల్లా కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, జిల్లా కన్వీనర్‌గా నియమించడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. జిల్లాలో ఎమ్మార్పీఎస్ కమిటీలు వేసి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనమివ్వాలి

ఇబ్రహీంపట్నం, జూలై 18: ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని కోరుతూ గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో 30 వేల మంది ఆశాలు ఏళ్ల తరబడిగా గ్రామాల్లో సేవలందిస్తున్నా.. ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయంటూ ఆందోళన వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రమందజేశారు. సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, బుగ్గరాములు, ఎల్లేష్, చందునాయక్, చంద్రకళ, మణెమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి

ఆమనగల్లు : ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలతో పాటు ఉద్యోగుల, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, మండలాల ఆశా కార్యకర్తలు గురువారం తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోయి వీలైనంత పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జె.పెంటయ్య, జిల్లా నాయకులు శివరాములు, కవిత, శిరీష, గీత, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రమందజేస్తున్న ఆశాలు

ఎంపీగారూ.. తాండూరు సమస్యలు తీర్చండి



తాండూరు, జూలై 18: చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన తర్వాత ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మొదటి సారి తాండూరుకు శుక్రవారం వస్తున్నారు. ఇక్కడ పలు ప్రధానమైన సమస్యలు కేంద్రంతో ముడిపడి ఉన్నాయి. ఈ సమస్యలపై ఎంపీ ప్రత్యేక దృష్టి పెట్టాలని తాండూరు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. తాండూరు కందిపప్పుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా కంది పంటను పండిస్తున్న తాండూరు ప్రాంతమే. అలాంటి కంది పప్పుకు కంది బోర్డును ఏర్పాటు చేయాలని దశాబ్ధకాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పసుపు బోర్డు ఏర్పాటైయిన విషయం విధితమే. అదే తరహాలో తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు ఎంపీ కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా తాండూరు రైల్వేస్టేషన్‌లో గరీబ్ రాథ్, హంసపార్, పద్మావతి, రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, వికారాబాద్ జంక్షన్‌లో నిలిపే పల్నాడ్ ఎక్స్‌ప్రెస్‌ను తాండూరుకు పొడిగించాలని, తాండూరు నుంచి షోలాపూర్ వరకు ఉదయం వేళ ప్యాసింజర్ రైలును నడిపిస్తే రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడుతుంది. మండల కేంద్రమైన బషీరాబాద్ (నవాండ్గి) రైల్వే స్టేషన్‌లో రాయలసీమ, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఉంది. పాత తాండూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకుండా అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం ఆస్తి నష్టం జరగకుండా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఈ సమస్యలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివే. అదే విధంగా గతంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తాండూరులో డస్ట్‌ను పరిశీలించగా దేశంలోనే రెండోస్థానంలో నిలిచిందని గుర్తించారు. ఈ సమస్యతో తాండూరులో శ్వాసకోశ, ఉదర కోశ, ఊపిరితిత్తుల వంటి రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించి ప్రత్యేక నిధులు రాబట్టి శాశ్వత పరిష్కరం చూపాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులతో కొనసాగుతున్న భారీ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభించడం లేదు. తాండూరు ప్రాంతంలో విస్తరించిన పెన్నా, చెట్టినాడు, ఇండియా సిమెంట్ కర్మాగారాలుండగా ఇందులో ప్రధాన విభాగాలలో గానీ, ఒక మోస్తారులో ఉన్న ఉద్యోగాలు, చివరకు రోజు వారీ వేతనంతో కూడిన ఉద్యోగాలను ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నారు. ఈ విషయంలో ఎంపీ పరిశ్రమల అధికారులతో చర్చించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సివుంది. అదేవిధంగా తాండూరు మండలం జినగుర్తి గేటు వద్ద పారిశ్రామిక వాడ సర్వేలకే పరిమితమైంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, తాండూరు కాగ్నా నది సమీపంలోనున్న ఆచార్య రంగ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ కోర్సుల కళాశాలను ఏర్పాటు, కొత్తగా ఏర్పాడిన గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు ప్రత్యేక సిబ్బంది నియమకం చేపట్టాలని కోరుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం ఉన్న ప్రాంతాలైన సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి, పాత తాండూరు, రాజీవ్ గృహకల్ప, ఎన్జిఆర్ కాలనీ వాసులకు ఉపాధి హామీ పథకం వర్తించేలా చూడాలి.

మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరం

శంషాబాద్ రూరల్, జూలై 18: మాదకద్రవ్యాలు సమాజానికి అత్యంత ప్రమాదకరమని శంషాబాద్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దషాపూర్ పీఎస్ఆర్ (ఫార్మసీ) కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


శంషాబాద్ రూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరేందర్‌రెడ్డి

డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి

కడ్తాల్ : డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని సీఐ శివప్రసాద్ కోరారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, సమస్యలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై వరప్రసాద్, ప్రిన్సిపాల్ రవి, తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేసి సంబురాలు చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, జూలై 18: బేషరతుగా రైతుల రుణాలు మాఫీ చేసి సంబురాలు చేసుకోవాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవటానికి రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం సంబురపడుతుందే తప్ప రైతులకు మాత్రం అనుకున్న మేరకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ ప్రక్రియను తూతూ మంత్రంగా చేట్టిందన్నారు. రూ.35వేల కోట్ల రుణ మాఫీ చేయాల్సి ఉండగా ఐదారు వేల కోట్లతో సరిపెట్టుకుందన్నారు. సమగ్రంగా సర్వే నిర్వహించి రైతులకు రుణ మాఫీచేస్తే బాగుంటుందన్నారు. రైతుల సంక్షేమం విస్మరించిన ప్రభుత్వాలకు మనుగడ ఉండబోదని విమర్శించారు. వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల బాలాజీనగర్‌లో వీధికుక్కల దాడిలో ఓ చిన్నారి మృతి చెందడం బాధాకరమన్నారు. తన పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో వీధికుక్కల నియంత్రణ కోసం తగు చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా అందరు కలిసి కట్టుగా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశలో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్ మేడ్చల్ మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హంసరాణి కృష్ణ గౌడ్, అమరం సరస్వతీ మోహన్ రెడ్డి బేరి బాల్‌రాజ్, జైపాల్ రెడ్డి, హేమంత్ రెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, సీంజీవ గౌడ్, బాబు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి.

భయం గుప్పిట్లో జలాల్‌పూర్


దాయాదుల దాడిలో వినియోగించిన చక్రాల కత్తులు (ఫైల్)


మొహర్రం వేడుకల్లో దయాదులు దాడులకు దిగిన ప్రాంతం

బషీరాబాద్, జూలై 18: మండలంలోని జలాల్‌పూర్ గ్రామం భయం గుప్పిట్లో మగ్గుతోంది. మొహర్రం పండుగ వేడుకల్లో మంగళవారం అసైదులా ఆడుతుండగా పాత కక్షలతో తలెత్తిన గొడవలో ఇరు కుటుంబాల దాయాదులు రెచ్చిపోయి చక్రాల కత్తులు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని భయానక వాతావరణం సృష్టించిన విషయం తెలిసిందే. గ్రామంలో చక్రాల కత్తులు, కర్రలను ఉపయోగించి రెండు కుటుంబాల వ్యక్తులు మొహర్రం పండుగలో దాడులకు దిగడంతో గాయాలవడం ప్రత్యక్షంగా చూసిన స్థానిక జనానికి భయం వీడటంలేదు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మొహర్రం పండుగలో చోటు చేసుకున్న సంఘటనపై గ్రామస్తులు భయకంపితులవుతున్నారు. అందరూ పండగ వాతావరణంలో ఉండగా, ఇరు కుటుంబాల దాయాదులు దాడులను గుర్తుచేసుకుంటూ భయందోళన చెందుతున్నారు. ఆ సమయంలో మహిళలు, చిన్నారులు ఏం జరుగుతుందో తెలియక ఇళ్లకు పరుగులు పెట్టారని ఇదెక్కడి దాడులంటూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ దాయాదుల గొడవలో ఎక్కడికి దారితీస్తుందోనని ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఈ దాడులకు దిగిన పరిసర ప్రాంతంలో రెండోరోజు గురువారం కూడా జనం సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించిచడం గమనార్హం. ఇక్కడి ప్రాంతానికి ఎవరైనా కొత్తవారు వస్తే బిక్కు బిక్కుమంటూ ఇళ్లలోంచి చూస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్, సిబ్బందితో గ్రామానికి చేరుకుని దాడులకు పాల్పడిన ఇరు కుటుంబాలతో విచారణ జరిపి వెళ్లారు. ప్రజల్లో భయం పోగొట్టేందుకు పోలీసులు మేమున్నామనే భరోసా కల్పిస్తే బాగుంటుందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమైంది. కాగా దాయాదులు చక్రాల కత్తులను పండుగలో అసైదులా ఆడేందుకు స్థానికంగా ఒక వ్యక్తి వద్ద ప్రత్యేకంగా 30 వరకు చేయించుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. చక్రాల కత్తులను పోలీసులకు దొరకకుండా బావిలో పడేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇరు కుటుంబాల పరస్పర ఫిర్యాదులపై 11మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్క తేలాల్సిందే..!

- చైర్‌పర్సన్, కమిషనర్ మధ్య కోల్డ్‌వార్
- తాండూరు మున్సిపాలిటీలో కొత్త పంచాయితీ


చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్


కమిషనర్ విక్రం సింహారెడ్డి

తాండూరు, జూలై 18: తాండూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, కమిషనర్ మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. మున్సిపాలిటీలో ఖర్చు వివరాలను చైర్‌పర్సన్ అడిగితే కమిషనర్ చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ వివాదం చివరకు ఎమ్మెల్యే చెంతకు చేరింది. అక్కడ కూడా ఇద్దరి మధ్య సయోధ్య కుదరలేదని తెలిసింది. మున్సిపాలిటీ లెక్కలు తెల్చాల్సిందేనని చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ పట్టుబడుతున్నారు. చివరకు అకౌంట్ గదికి తాళం వేసుకునే పరిస్థితికి దారి తీసింది. కౌన్సిల్‌కు తెలపకుండానే మున్సిపల్ సాధారణ నిధులను డ్రా చేయడం వల్ల చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తున్నారు. నాలుగు నెలలుగా మున్సిపాలిటీల పాలన ఇష్టానుసారంగా జరుగుతుందని చైర్‌పర్సన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మున్సిపాలిటీ కమిషనర్, చైర్‌పర్సన్ ఇద్దరూ కలిసి సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఇద్దరికీ సూచించినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్‌కు సహకరించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించినట్లు సమాచారం. సమన్వయం లేని కారణంగా మున్సిపల్ సమావేశాలు ఆర్నెళ్లుగా జరగడం లేదు. కమిషనర్ పాలకవర్గాన్ని కాదని ఒంటెద్దు పోకడలకు పోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.


కేశంపేట : నియమాక పత్రం అందుకుంటున్న నర్సింహ

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక


ఉత్తర్వులు అందుకుంటున్న ఆంజనేయులుగౌడ్, లక్ష్మీపతిగౌడ్

ఆదిభట్ల/చేవెళ్ల, జూలై 18 : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈమేరకు ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన పండల లక్ష్మీపతిగౌడ్‌ను సభ్యుడిగా నియమిస్తూ గురువారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ నగరంలో ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీపతిగౌడ్ ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేశారు. బీజేపీలో కూడా మండల, జిల్లా స్థాయిలలో పలు పదవులు నిర్వహించారు. అతని పనితీరుతో సంతృప్తి చెందిన రాష్ట్ర నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో భాద్యలప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి, కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే చేవెళ్ల మండలంలోని అల్లావాడ గ్రామానికి చెందిన తాళ్ల ఆంజనేయులుగౌడ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేశంపేట మండలం కొనాయపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సోప్పరి నర్సింహను రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

పాఠశాలల అభివృద్ధికి సహకారమందిస్తా

కొందుర్గు, జూలై 18: షాద్‌నగర్ నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్ళిన జి.చెన్నారెడ్డి, ఎం.మోహన్‌రావు, కె.ప్రసన్న కుమరి, పి.జ్యోత్స్న, ఎన్.హన్య, ఎన్.రాధమ్మ, ఎన్.స్వాములు, ఎ.రమేష్ కుమార్, వి.హనుమంత్, కె.కుర్మారావులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మాజీ వైస్ఎంపీపీ రాజేష్ పటేల్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంఈవో కిష్టారెడ్డి, విశ్రాంత ఎంపీడీవో డాక్టర్ ఆంజనేయులు, హెచ్ఎం గాయిత్రిదేవి, విద్యాసాగర్, శ్రీధర్‌రెడ్డి, కె నర్సింలు, కె.రాజేందర్, శేఖర్‌గౌడ్, శ్రీను, రామకృష్ణ, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రుణల మాఫీ జీవోను సవరించాలి


మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి,జూలై 18: పంట రుణాల మాఫీ విషయంలో జారీ చేసిన 567 జీవోలోని కొన్ని అంశాలను సవరించి రూ.2లక్షల వరకు రుణం పొందిన రైతులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, ఒకే వ్యక్తికి రుణమాఫీ చేయడం వల్ల ఇతరులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆధార్, పాసుబుక్ డేటా, రేషన్‌కార్డులేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయని తెలిపారు. పట్టా పాసు పుస్తకాల కోసం ధరణిలో దరఖాస్తులు పది లక్షలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణ మాఫీ చేసిన బ్యాంకర్లు కోత్రీలు పెట్టే అవకాశం ఉందని, అందుకు రైతుల సేవింగ్ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, వెంకటయ్య, అనంతయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

ముగిసిన గీతా పారాయణం

వికారాబాద్, జూలై 18: గీతా వాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అశాడ మాస భగవద్గీత పారాయణంలో భాగంగా చివరి రోజు సందర్భంగా వైభవలక్ష్మి దేవాలయంలో పారాయణం నిర్వహించినట్లు గీతా వాహిని అధ్యక్షురాలు శ్రీదేవి సదానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గీతా పారాయణం ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సమాజంలో భగవద్గీత పారాయణం చేయడం వల్ల ఆధ్యాత్మికత ధార్మికత పెంచేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్వాహకురాలు స్వరూప రమేష్ మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం కూడా పూర్వజన్మ సుకృతంగా అబివర్ణించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి మాట్లాడుతూ అమెరికా నాసా వంటి సంస్థలు కూడా రామా సేతు నిర్మాణం నిజమేనని నిర్ధారించినా కొంత మంది సెక్యులర్ వాదులు మూఢనమ్మకాలు నమ్మం సైన్స్‌నీ మాత్రమే నమ్ముతామని చెప్పి ఇప్పుడు నాసా చెప్పిన విషయాన్నీ అంగీకరించపోవడంతో వారు హిందూ మతంపై ఎంత విషం చిమ్ముతున్నారో తెలిపేందుకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విక్రమ్, గీతా వాహిని, ఉపాధ్యక్షురాలు మోనిగారి లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, వరలక్ష్మి, ఝాన్సీరాణి, మాధురి, లక్ష్మి, విజయ, సంజీవరాణి, సరళ, సునీత, జ్యోత్స్న, నాగరాణి, అనురాధ, కరుణ, శిరీష, సరిత, రంజిత, సంతోష, గీతా వాహిని బృందం, భక్తులు పాల్గొన్నారు.


గీతాపారాయణంలో పాల్గొన్న మహిళలు

ఊరూవాడా సంబురాలు



తాండూరు: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 18: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిన ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు. తాండూరులో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి అంబేడ్కర్‌చౌక్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆగస్టు 15లోపు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కచ్చితంగా జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, గాజీపూర్ నారాయణ రెడ్డి, కరుణం పురుషోత్తంరావు, ఉత్తంచంద్, పట్లోళ్ల బాల్‌రెడ్డి, హబీబ్ లాల, ప్రభాకర్ గౌడ్, రాము, వెంకన్నగౌడ్ ఉన్నారు.

యాలాల: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించడంతో గురువారం యాలాల మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ సంబురాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కరుణం పురుషోత్తంరావు, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సిద్రాల శ్రీనివాస్, అక్బర్ బాబా, రుద్రమూర్తి, కల్వ సుజాత, జక్కపల్లి అమృతయ్య, అన్న సాగర్, సత్యనారాయణ రెడ్డి, హనుమంతు, ఏవో యాదగిరి పాల్గొన్నారు.

బంట్వారం (కోట్‌పల్లి): కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు ప్రభుత్వమని తాండూరు ఎమ్మెల్యే బీ మనోహర్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన నాయకులు, రైతులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సీఎం రెవంత్‌రెడ్డి చిత్రపటానికి పాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, ధారసింగ్, నాయకులు మహిపాల్ రెడ్డి, బందెయ్య, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోట్‌పల్లి, బంట్వారం మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు.

మోమిన్‌పేట్: మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అమ్రాదికలాన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంగమేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ పద్మవెంకట్‌రెడ్డి, మల్లేశ్, మహేందర్ పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం మండలం కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పి.రాములు, బుజ్జయ్యగౌడ్, కిషోర్, గఫార్ పాల్గొన్నారు. రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టిన రేవంత్‌రెడ్డి రైతుబంధవుడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాఫీ.. హ్యాపీ

తాండూరు: రైతు రుణమాఫీ మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వం గురువారం డబ్బులను అకౌంట్లలో జమచేయడంతో రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. తాండూరు సబ్‌డివిజన్ పరిధి 8 మండలాలు, 2 మున్సిపాలిటీల్లో 19,750 మంది రైతులకు రూ.109.89కోట్ల రుణమాఫీ అయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలో అత్యధిక మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. ఎస్‌బీఐ, సహకార, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, దేనా బ్యాంకు, విజయ బ్యాంకు, తదితర బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులకు లక్ష వరకు రుణమాఫీ డబ్బు ఖాతాల్లో జమ కానుంది.్లో జమ కానుంది.

తాండూరు రూరల్: రుణమాఫీ అమలవుతున్న సందర్భంగా గురువారం రాత్రి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అంతారం రైతు వేదిక వద్ద రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్: రైతు రుణామాఫీ సంబురాల్లో భాగంగా నాయకులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఎఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, వైస్ చైర్మన్ చందర్‌నాయక్, మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెద్దేముల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం ప్రారంభించడంతో హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, మండల అధ్యక్షులు గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్‌కుమార్‌గుప్త, నారాయణరెడ్డి, రుద్రారం మహిపాల్‌రెడ్డి, గాజీపూర్ నారాయణరెడ్డి, మల్లేశం, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిగి: రెండు లక్షల పంటరుణాల మాఫీ చరిత్రాత్మకమని డీసీసీ అధ్యక్షుడు,పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటరుణాల మాఫీ సందర్భంగా నిర్వహించిన సంబురాల్లో భాగంగా గురువారం పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి హణ్మంత్‌ముదిరాజ్, పరిగి మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

కొడంగల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రైతు రుణ మాఫీ పట్ల కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, శివకుమార్ గుప్త, సోమశేఖర్, నయీమ్, శంకర్ నాయక్, దాము పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: రైతు రుణమాఫీ సందర్భంగా బొంరాస్‌పేట్, దుద్యాల మండల కేంద్రాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు వెంకట్రాములుగౌడ్, రాజేశ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

దౌల్తాబాద్: రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

దోమ: రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా గురువారం రాత్రి దోమ మండల కేంద్రంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాములునాయక్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీపై రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని చౌరస్తాలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, మాజీ ఎంపీపీలు సత్యహరిశ్చంద్ర, అంజిలయ్యగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో వీరస్వామి, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు. పుట్టపహాడ్ గ్రామంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.



కొడంగల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు



మూడు చింతలపల్లి: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్‌యాదవ్ అన్నారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, కలీమొద్దీన్, సుభాష్‌యాదవ్, రామేశ్వర్, దివాకర్, సురేశ్‌యాదవ్, నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.

పూడూరు: మండల రైతు వేదికలో రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రైతులు, కాంగ్రెస్ నాయకులు మన్నెగూడ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మన్నెగూడ నుంచి పూడూరు రైతు వేదిక వరకు రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. మండలంలోని 2, 437 మంది రైతులకు గాను రూ.12కోట్ల 11లక్షల 2వేల 399ల రుణమాఫీ చేశారు.

వికారాబాద్: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ రైతులకు రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌లకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, కిషన్ నాయక్, మురలి, బొండాల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్, జూలై 18: రైతు రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టమని పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లైవ్ కార్యక్రమాన్ని మండలంలోని రాయిలాపూర్ రైతువేదికలో కాంగ్రెస్ నాయకులు, రైతులు టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతు రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సహకార సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: కాంగ్రెస్ పాలనలోనే రైతురాజ్యం అని మూడు చింతలపల్లి మాజీవైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లిలో రైతు వేదికలో గురువారం రైతురుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రైతులను అన్యాయం చేశాయని తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రుణమాఫీ చేయకుండా రైతులను గాలికి వదిలేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, ఎంపీడీవో వత్సలాదేవి, ఏవో కృష్ణవేణి, మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు లక్ష్మారెడ్డి, జగన్నాథం, జైపాల్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



వికారాబాద్: సీఎం, స్పీకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పరిగి: రుణమాఫీ సంబురాల బైక్‌ర్యాలీలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఘట్‌కేసర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం సాయంత్రం రైతు రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, జంగమ్మ, కర్రె రాజేష్, మామిండ్ల ముత్యాలు బర్ల రాదాకృష్ణ, కొంతం అంజిరెడ్డి, సగ్గు అనిత పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్ తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ చౌరస్తాలో గురువారం ఏకకాలంలో రుణమాఫీ చేసినందుకు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, కాంగ్రెస్ నాయకులు సామల అమర్, ఎండీ ఇక్బాల్, మెట్టు రమేష్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: శామీర్‌పేట మజీద్‌పూర్ సమీపంలోని రైతువేదిక వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల రుణమాఫీ సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, పార్టీ తదితర నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

విడతల వారీగా రైతు రుణమాఫీ



మాట్లాడుతున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర: విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం కీసర రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల పంట రుణమాఫీ కార్యక్రమం వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి విచ్చేశారు. అర్హులైన ప్రతీఒక్క రైతుకు ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేస్తుందన్నారు. 12/12/2018 నుంచి 9/12/2023 మధ్య కాలంలో రైతులు తీసుకున్న రుణాలకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఈ మేరకు మొదటి విడతగా కీసర మండలంలో 556 మంది రైతులకు గానూ 2.66కోట్లు రైతుల రుణాల ఖాతాలో నేరుగా జయ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కీసర మండల ప్రత్యేక అధికారి పూర్ణిమ, మండల వ్యవసాయ శాఖ అధికారిణి మాదవీ లత, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో గ్యామా, వందన, రాజ్‌కూమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తాండూరు, జూలై 18: ఆశావర్కర్స్‌కు ఉద్యోగ భద్రతతో పాటు రూ.18వేల వేతనాన్ని ఇవ్వాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఆశావర్కర్లు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ తాండూరు డివిజన్ ఆశావర్కర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేశారు. ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఆశావర్కర్స్ ప్రతినిధులు సుభాత, లక్ష్మి, రాజమణి, శ్రీదేవి, రమాదేవి, కాంచన, శశికళ, సరిత, సులోచన, రేణుక, అరుణ, యాదమ్మలు ఉన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

తాండూరు రూరల్, జూలై 18: పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆపరేషన్ ముస్కాన్ టీం ఎస్ఐ కృష్ణ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గౌతాపూర్, చెంగోల్, మల్కాపూర్, అల్లాపూర్ గ్రామ శివారులోని పాలిషింగ్ యూనిట్‌లో గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణ మాట్లాడుతూ గౌతాపూర్ శివారులోని వెల్డింగ్ షాపులో పనిచేస్తున్న ఓ బాల కార్మికుడితో పాటు బసవేశ్వరనగర్‌లో ఓ పాలిషింగ్ యూనిట్‌లో బాల కార్మికుడిని గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, కానిస్టేబుళ్లు బస్వరాజ్, బాల్‌రాజ్‌గౌడ్, అనిత, శేఖర్, 1098 సిబ్బంది చంద్రప్పలు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు

తాండూరు రూరల్, జూలై 18: చిట్టిఘనాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప, బాల్‌రాజ్, భానుప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మంజుల రాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేత



పరిగి, జూలై 18: డీజీపీ జితేందర్‌ను గురువారం పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.భాస్కర్‌గుప్త మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కొత్తగా రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసినట్లు భాస్కర్‌గుప్త తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ధారూరు:** ధారూరులో బుధవారం అనారోగ్యంతో మృతిచెందిన యువకుడు తానేం ఆకాశ్ కుటుంబానికి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం చేశారు. అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ పంపించిన రూ.5వేల నగదును మృతుడి తండ్రి అనంతయ్యకు నాయకులు అందజేశారు.
- **కీసర:** కీసర గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నుంచి ప్రజలను రక్షించాలని కీసర పంచాయతీ అధికారికి గంగన్నకు, బీఆర్ఎస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్ వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పలు కాలనీలో కుక్కలు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో పిల్లల ప్రాణాలకు అపాయం ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.
- **కులకచర్ల:** మెదడు వాపు వ్యాధి రాకుండా విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి వాజిహుద్దీన్, మాధురి తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌లకు మెదడు వాపు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల విద్యార్థులకు ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఎంఈవో హబీబ్ అహ్మద్, వైద్యులు ప్రశాంతి, మనీష్‌కుమార్, సిబ్బంది యామ్మ, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.
- **కీసర:** ముదిరాజ్‌లను బీసీ ఏలో కలపాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కీసర మండల సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్‌ల సుదీర్ఘ ఆకాంక్ష అయిన బీసీ-డి నుంచి బీసీ-ఏకు మార్పు చేయాలని, కాంగ్రెస్ పార్టీ తన మానిఫెస్టో అయిన అభయ హస్తం పథకం ద్వారా ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ సభ్యులు తహసీల్దార్ అశోక్‌కు వినతి పత్రం అందజేశారు.
- **బొంరాస్‌పేట్:** తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కొడంగల్‌లో గురువారం గురునాథ్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంతోష్, శేఖర్,గౌడ్, యాదయ్య, బోయిని మల్లేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11, 15వ వార్డులలో రూ.6.5లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సాబేర్‌అలీ, కౌన్సిలర్లు మల్లేష్, నరేష్, రవీందర్, నాయకులు యాదగిరి, దేవేందర్, అంజనేయులు, కయ్యూం పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల మొక్కలు పంపిణీ చేస్తున్నందున ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్లలోని చైర్మన్ నివాసంలో కలిశారు. ఎస్సీ సోదరులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలు అందించి అభివృద్ధి చెందేందుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఆయన కలిసిన వారిలో శ్రీనివాస్, ఎర్ర మాదవిరాజు, మల్లిఖార్జున్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.
- **పరిగి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పరిగి మునిసిపల్ పరిధిలోని పలుకాలనీల్లో గురువారం డెంగీ, మలేరియా వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. దోమలో నివారణలో మురికినీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వదిలారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకన్న, కౌన్సిలర్ మునీరు, ఎం.శేఖర్, నాయకులు నరేష్, అధికారులు రాఘవేందర్, శ్రీనివాస్, వినోద్, వీరేష్ పాల్గొన్నారు.
- **మేడ్చల్ టౌన్:** మున్సిపల్ పరిధిలోని ప్రతి వీధిలో మట్టి రోడ్డులు లేకుండా సీసీ రోడ్డులు నిర్మించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 23 వార్డులను రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. పలు వార్డుల్లో అంతర్గత డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం కోసం తవ్విన సీసీ రోడ్లను తిరిగి నిర్మించడానికి నిధులు కేటాయించామన్నారు. అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పానుగంటి సుహాసిని, కోఆప్షన్ సభ్యుడు మహెబూబ్ అలీ, మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవీందర్ పాల్గొన్నారు.
- **దౌల్తాబాద్:** సైబర్ మోసాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేస్తుండటంతో సైబర్ మోసగాళ్ల వాట్సాప్, మెయిల్‌కు లింకులు పంపించి మోసం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఏదో బ్యాంకుపేరుతో వాట్సాప్ ప్రొఫైల్ బ్యాంకుపేరు, పిక్చర్ బ్యాంకు లోగోతో వాట్సాప్ యాప్‌లో ఏపీకే ఫైల్స్ పంపించి మోసానికి పాల్పడుతారన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

క్రైం కార్నర్

గౌతాపూర్ వద్ద లారీ బోల్తా.. కార్మికులకు గాయాలు



గౌతాపూర్ గ్రామ సమీపంలో బోల్తా పడిన నాపరాతి రాళ్ల లారీ

తాండూరు రూరల్, జూలై 18: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఓ లారీ బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని గౌతాపూర్ గేటు వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెల్కటూర్ గ్రామానికి చెందిన స్వామి, లింగప్ప, పరుశురాం, రాములు కార్మికులు నాపరాతి లారీల్లో ఉన్న బండ రాళ్లను అన్‌లోడింగ్ చేస్తుంటారు. బెల్కటూర్ గ్రామానికి చెందిన లారీని డ్రైవర్ సైదులు నడిపిస్తున్నారు. ఓగీపూర్ గనుల నుంచి నాపరాతి లోడింగ్‌తో తాండూరు పట్టణానికి కార్మికులతో కలిసి వస్తుంది. గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో గౌతాపూర్ గేటు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి నాపరాతి బండరాళ్లతో ఉన్న లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలో ఉన్న స్వామి, లింగప్ప, పరుశురాం, రాములుకు గాయాలయ్యాయి. స్థానికులు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే స్వామి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అతివేగం, అజాగ్రత్తగా నడిపిన లారీ డ్రైవర్ సైదులు గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, జూలై 18: పశువులను కబేళాలకు తరలిస్తున్న కంటైనర్‌ను అదుపులోకి తీసుకోని డ్రైవర్‌పై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధి డీ-మార్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో బీబీనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కంటైనర్ తనిఖీ చేశారు. అందులో 25 పశువులు ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘనాపూర్ మండలం, వడ్డిచెర్ల గ్రామానికి చెందిన డ్రైవర్ అప్రద్(23)అదుపులోకి తీసుకొని విచారించగా, జనగామ, స్టేషన్ ఘనాపూర్, ఐనవోలు పరిసర ప్రాంతాల నుంచి పశువులను కొనుగోలు చేసి నగరంలోని కబేళాకు తరలిస్తున్నట్లు తెలిపారు. పశువులను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించారు. కంటైనర్‌ను అదుపులోకి తీసుకోని, డ్రైవర్ అప్రద్‌పై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా యంనంపేట్ చౌరస్తాలో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో బీబీనగర్ నుంచి నగరానికి వెళుతున్న డీసీఎం తనిఖీ చేశారు. డీసీఎంను తనిఖీ చేయగా అందులో 39 ఆవులు, 29 ఎద్దులు నగరంలోని కబేళాకు తరలిస్తున్నాడు. నగరంలోని బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన డ్రైవర్ నేనావత్ రాజు(20)ను అదుపులోకి తీసుకోని విచారించగా, ఒడిస్సా రాష్ట్రం నవరంగ్ గ్రామం నుంచి సబావత్ విజయ్ పశువులను కొనుగోలు చేసి ఒకదానిపై మరొకటి తాళ్లతో కట్టేసి నగరంలోని బహదూర్ పూర కబేళాకు తరలిస్తున్నట్లు తెలిపారు. అందులో ఒక ఆవు, ఒక ఎద్దు మృతిచెందినట్లు తెలిపారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి డీసీఎం నెంబర్‌ప్లేట్ మార్చి డీసీఎంను తిప్పుతున్నాడని తెలిపారు. పశువులను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించి, డీసీఎంను అదుపులోకి తీసుకొని, డ్రైవర్ రాజు, పశువులు కొనుగోలు చేసిన విజయ్‌లపై పలు సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

అనుమతులు పొందాకే నిర్మాణాలు చేపట్టాలి

కీసర రూరల్, జూలై 18: నిబంధనల మేరకు అనుమతులు పొందాకే నిర్మాణాలు చేపట్టాలని నాగారం మున్సిపల్ టీపీఎస్ ఏ.కావ్య సూచించారు. మున్సిపల్ పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలను గురువారం తొలగింపజేశారు. మున్సిపల్ పరిధి రాంపల్లిలో నాలుగు, నాగారంలో ఒక షెడ్డును, రాంపల్లిలో ఒక ఇంటిని జేసీబీ సాయంతో, పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఎస్ బీపాస్ ద్వారా ఆన్‌లైన్ అనుమతులు పొందాకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లేదంటే నిర్మాణాలను తొలగించటంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.